రోడ్డు ప్రమాదంలో హెడ్‌కానిస్టేబుల్ మృతి

మరో కానిస్టేబుల్‌కు గాయాలు

ప్రజాశక్తి- గంట్యాడ

మండలంలోని కొండతామరపల్లి జంక్షన్ వద్ద బుధవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎపిఎస్‌పి బెటాలియన్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ ఎన్‌వి రమణ మృతి చెందారు. మరో కానిస్టేబుల్ గురునాథ్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. రమణ అనంతగిరిలో విధులు ముగించుకుని విజయనగరం వైపు వస్తుండగా విజయనగరం నుంచి అనంతగిరి విధులకు వెళుతున్న గురునాథ్‌రెడ్డి ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీ కొట్టాయి. ఈ ప్రమాదంలో రమణ అక్కడికక్కడే మృతి చెందగా గురునాథ్ రెడ్డి తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న విజయనగరం సిఐ లక్ష్మణరావు గంట్యాడ ఎస్ఐ సాయికృష్ణ పోలీస్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన కానిస్టేబుల్‌ను 108 వాహనంలో విజయనగరం ఆసుపత్రికి తరలించారు.

విజయనగరంలో బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

మోడీ సభకు బస్సులు

ప్రయాణికులకు పాట్లు

విశాఖలో జరిగిన ప్రధాని మోడీ బహిరంగ సభకు ఆర్‌టిసి బస్సులనింటినీ అధికారులు తరలించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సులు లేకపోవడంతో కాంప్లెక్స్ కు వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించి ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించి గమ్యస్థానాలకు చేరుకునేందుకు నానా పాట్లు పడ్డారు. బస్సులు లేక ఉమ్మడి జిల్లాలోని ఆర్‌టిసి కాంప్లెక్సులన్నీ నిర్మానుష్యంగా కనిపించాయి.

బస్సుల్లేకపోవడంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సు ఆవరణలో భోజనం చేస్తున్న ప్రయాణికులు

ప్రజాశక్తి-విజయనగరంకోట, బొబ్బిలి

విజయనగరం జిల్లాలోని విజయనగరం, శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోల నుంచి ఉన్న 175 బస్సుల్లో 100 బస్సులకుపైగా, పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు, పాలకొండ డిపోల నుంచి 80 బస్సులను ప్రధానమంత్రి మోడీ సభకు విశాఖకు బుధవారం తరలించారు. దీంతో ప్రయాణికులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విజయనగరం నుంచి 24 వేల మందిని తరలించడానికి పూనుకోవడంతో ఈ ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేటు విద్యాసంస్థలకు చెందిన మరో 50 బస్సులు వరకు కేటాయించారు. మన్యం జిల్లాలో నాలుగు నియోజకవర్గాల నుంచి నాలుగు వేల మందిని తరలించాలని నిర్ణయించారు. ఈనేపథ్యంలో పాఠశాలలకు అధికారులు అనధికార సెలవు ప్రకటించడంతో విద్యాసంస్థలన్నీ వెలవెలబోయాయి. బస్సులు లేకపోవడంతో విజయనగరం ఆర్‌టిసి కాంప్లెక్సులో ప్రయాణికుల అగచాట్లు అన్నీ ఇన్నీ కావు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వేచి ఉన్నా బస్సులు రాకపోవడంలో ప్రయాణికులు హోటల్ నుంచి కాంప్లెక్సులోనే భోజనాలు చేస్తున్న ఘటనలు చోటు చేసుకున్నాయి. చంటి పిల్లల తల్లులు బస్సులు లేక పిల్లలతో గంటల తరబడి నిరీక్షించారు. మరోపక్క కొన్ని కళాశాలలు సెలవు ప్రకటించడంతో ఇళ్లకు వెళ్లేందుకు విద్యార్థులు తమ లగేజీలు పట్టుకొని ప్లాట్‌ఫారాలపై నిరీక్షించారు. కొన్ని ప్రాంతాలకు పూర్తిగా బస్సులను రద్దు చేయడంతో వారికి ఏమి చేయాలో దిక్కుతోచలేదు. చివరకు గత్యంతరం లేని ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించారు.

మోడీ సభకు పాఠశాలల బస్సులు

ప్రధాని మోడీ సభకు ఆర్‌టిసి బస్సులతో పాటు ప్రైవేట్ పాఠశాలల బస్సులను కూడా వేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు సెలవు ఇచ్చి మోడీ సభకు బస్సులు పంపించడంతో అధికారుల తీరుపై తల్లిదండ్రులు మండిపడ్డారు. పాఠశాలలకు సెలవు ఇచ్చి బస్సులు వేయడం ఏమిటని ప్రశ్నించారు. బొబ్బిలి మున్సిపాలిటీ నుంచి 9 బస్సులు వేయగా వాటిలో రెండు ఆర్టీసీ బస్సులు, మిగిలినవి ఏడు ప్రైవేట్ విద్యా సంస్థలకు చెందిన బస్సులు ఉన్నాయి.

జనం తరలింపునకు పాట్లు

పాలకొండ : విశాఖపట్నంలో ప్రధాని మోడీ సభకు జనాన్ని తరలించేందుకు అధికారులు, నాయకులు నానా పాట్లు పడ్డారు. ముఖ్యంగా పాలకొండ డిపో నుంచి 41 బస్సులు ఏర్పాటుచేశారు. దీంతో బస్సులను నింపేందుకు టిడిపి కూటమి నేతలు చాలా అగచాట్లు పడ్డారు. నాయకులు, అధికారులు ఎంత ప్రయత్నించినా, ప్రజలు మాత్రం దానికి సుముఖత చూపలేదు.

ప్రయాణికులకు ఇబ్బందులు

మోడీ సభకు జనాన్ని తరలించడానికి డిపో పరిధిలో నుంచి 41 బస్సులు కేటాయించారు. దీంతో ప్రతిరోజూ వివిధ రూట్లలో తిరిగే బస్సులు సరిపోక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తూరు, బామిని, వీరఘట్టం, రాజాం తదితర ప్రాంతాలకు బస్సులు లేక ప్రయాణికులు.. గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చింది.

మోడీ సభకు పార్వతీపురం నుంచి నలుగురితో వెళ్తున్న బస్సు

ముగిసిన రెవెన్యూ సదస్సులు

- జిల్లా వ్యాప్తంగా 6,754 దరఖాస్తులు
- పట్టాదారు పాస్‌పుస్తకాల కోసమే 4,854 అర్జీలు
- మొత్తంగా రెవెన్యూ సమస్యలే ఎక్కువ

ఎస్.కోట మండలం దాంపురం రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ (ఫైల్)

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గత నెల 6న మొదలైన రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. జిల్లా వ్యాప్తంగా 983 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఇందులో 40, 320మంది జనం పాల్గొన్నట్టు అధికార యంత్రాంగం భావిస్తోంది. ఈ సదస్సుల్లో 8వ తేదీ ఉదయం వరకు 6,764 దరఖాస్తులు అందినట్టు అధికారిక సమాచారం. ఇందులో అత్యధికంగా పట్టాదారు పాస్‌పుస్తకాల కోసం 4,854 అర్జీలు అందాయి. రీసర్వేలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని 345, సరిహద్దు సమస్యలను ప్రస్తావిస్తూ 2,68, కుల ధ్రువీకరణ పత్రాల జారీ, తప్పుల సరవణ చేయాలని 250మంది, తమ పట్టాలను సబ్ డివిజన్ చేయాలని మరో 143మంది అర్జీలు పెట్టుకున్నారు. మిగిలిన వాటిలో ప్రభుత్వ భూముల ఆక్రమణ, ఇనాం భూముల సమస్యలు, రోడ్ల నిర్మాణాలకు ఎదురౌతున్న ఇబ్బందులు తదితరాలపై అర్జీలు అందాయి. మొత్తం అర్జీల్లో ఇప్పటికే 2,468 దరఖాస్తులకు పరిష్కారం చూపినట్టు అధికారులు చెబుతున్నారు. మిగిలిన 4,296 దరఖాస్తులు నిర్దిష్టమైన కాలపరిమితిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కూడా అంటున్నారు. అందిన దరఖాస్తుల్లోనూ ఎక్కువగా పేద, మధ్య తరగతి కుటుంబీకులే ఉన్నారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి టిడిపి ప్రభుత్వం చేపట్టిన వెబ్ ల్యాండ్ నమోదులో తప్పుల తడకలు, 2019 -2024 మధ్య వైసిపి ప్రభుత్వంలో చేపట్టిన జగనన్న సమగ్ర భూసర్వేలో జరిగిన తప్పిదాలే ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా రీసర్వేలో జరిగిన లోపాల వల్ల గ్రామాలకు గ్రామాలే 22ఎలోకి వెళ్లాయి. వీటిని ఫ్రీహోల్డ్ చేయాలని అధికారులకు ఎన్నోసార్లు బాధిత గ్రామాల ప్రజలు మొరపెట్టుకున్నా పరిష్కారానికి చర్యలు తీసుకోలేదు. దీంతో, క్రయ, విక్రయాలు నిలిచిపోయాయి. ఆయా భూములపై గతంలో తీసుకున్న వ్యవసాయ రుణాలు, ముద్ర లోనులు రీషెడ్యూల్ చేసుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. అన్నదమ్ముల మధ్య భూమి పంపకాలు సమానంగా ఉన్నప్పటికీ రికార్డుల్లో మాత్రం హెచ్చుతగ్గులు చూపిస్తున్నారు. దీనికి తోడు వెబ్ ల్యాండ్ నమోదులో జరిగిన తప్పిదాలు ఇప్పటికీ పరిష్కారం కాలేదు. దీంతో, చాలా మందికి 1బిలు రావడం లేదు. ఫలితంగా రుణాలు పొందలేక పోతున్నారు. ఇక గ్రామాలు, వాటి మధ్య లింకు రోడ్లు, చెరువులు చాలా వరకు ఆక్రమణకు గురయ్యాయి. కుల ధ్రువీకణ పత్రాలకు కూడా వందలాది మంది ఇబ్బంది పడుతున్నారన్న విషయం ఈ రెవెన్యూ సదస్సుల ద్వారా మరోసారి స్పష్టమైంది. జిరాయితీ భూములు కూడా ప్రభుత్వ భూములుగా నమోదు కావడంతో చాలా మంది ఇబ్బందులకు గురౌతున్నారు.

45 రోజుల్లో పరిష్కారం

వివిధ సమస్యలపై రెవెన్యూ సదస్సుల్లో అందిన అర్జీల్లో 36.49శాతం పరిష్కరించాం. మిగిలిన 63.31 శాతంలో సమస్య స్వభావాన్ని బట్టి 45రోజు ల్లోపు పరిష్కారమవు తాయి. ఈ విధంగా ప్రభుత్వ ఇదేశాలు కూడా ఉన్నాయి. అర్జీదారుడి సమస్యలకు పరిష్కారం చూపి సంతృప్తి పర్చడమే లక్ష్యంగా యంత్రాంగం పనిచేస్తుంది.

ఇ.మురళి, రెవెన్యూ సదస్సుల నోడల్ ఆఫీసర్
కెఆర్‌సిసి ఎస్‌డిసి, విజయనగరం జిల్లా

సమావేశంలో పాల్గొన్న కమిషనర్ నల్లనయ్య, రెవెన్యూ సిబ్బంది

పన్ను వృద్ధి రేటు మరింత పెంచాలి

వీడియో కాన్ఫరెన్స్‌లో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ హరినారాయణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను అధిగమించిన నేపథ్యంలో విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్యకు కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హరి నారాయణ అభినందించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై సిడియంఎ సమీక్ష నిర్వహించారు. ముందుగా రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను గూర్చి ప్రస్తావిస్తూ నగరపాలక సంస్థ రెవెన్యూ వసూళ్ల లక్ష్యాలను అధిగమించడం అభినందనీయమని అన్నారు. ఇదే ఒరవడిని కొనసాగిస్తూ మున్ముందు మరింత గణనీయమైన వృద్ధిరేటును సాధించాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. అలాగే కుక్కలకు చేపడుతున్న సంతాన నిరోధక శస్త్ర చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. నగరంలో చేపడుతున్న గుంతల మరమ్మతు పనుల పై ఆరా తీశారు. ఇప్పటికే గుర్తించిన గుంతలలో యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపడుతున్నామని కమిషనర్ తెలిపారు. కాన్ఫరెన్స్‌లో సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు రమణమూర్తి, హరిబాబు, డిఈలు శ్రీనివాసరావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సర్వీస్ ప్రొవైడర్ల రెండు రోజుల మేళా

నగరపాలకసంస్థ పరిధిలోగల 50 డివిజన్లలో గల 61 సచివాలయాల్లో సర్వీస్ ప్రొవైడర్లు అంటే ప్లంబర్సు, ఎలక్ట్రిషియన్లు, ఎసి, టివి మెకానిక్, వాటర్ ప్యూరిఫైయర్ మెకానిక్, రిఫ్రిజిరేటర్ మెకానిక్‌లకు ఈనెల 9,10 తేదీల్లో ఆనందగజపతి ఆడిటోరియంలో సర్వీస్ ప్రొవైడర్ల మేళా జరుగుతుందని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. నగరంలోని సర్వీసు ప్రొవైడర్లంతా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు.

హైకోర్టు ఉత్తర్వు తీసుకునేందుకు పిఒ నిరాకరణ

- మధ్యాహ్నం వరకు చంటిబిడ్డతో అంగన్‌వాడీ హెల్పర్ నిరీక్షణ
- యూనియన్ డిమాండ్‌తో ఉత్తర్వు కాపీ స్వీకరించిన సిబ్బంది

ప్రజాశక్తి-గజపతినగరం

రాజకీయ కక్ష సాధింపుల్లో భాగంగా తొలగించిన రామన్నపేట అంగన్‌వాడీ కేంద్రం హెల్పర్ మానాపురం సౌజన్యను తక్షణం విధుల్లో తీసుకోవాలంటూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వు కాపీని స్వీకరించేందుకు గజపతినగరం ఐసిడిఎస్ ప్రాజెక్టు పిఒ నాగమణి మీనమేషాలు లెక్కించారు. మధ్యాహ్నం వరకు ఐసిడిఎస్ కార్యాలయం వద్ద బాధితురాలిని వేచి ఉంచి చివరకు తీసుకునేందుకు నిరాకరించడంతో యూనియన్ డిమాండ్ మేరకు సిబ్బంది స్వీకరించారు. అంగన్‌వాడీ హెల్పర్ సౌజన్యను రాజకీయ వేధింపుల్లో భాగంగా గత ఏడాది నవంబర్ 30న అధికారులు తొలగించారు. అక్రమ తొలగింపునకు నిరసనగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సౌజన్య ఒకవైపు పోరాటం చేస్తునే మరోవైపు న్యాయపోరాటం కోసం హైకోర్టును ఆశ్రయించారు. దీంతోఆమెను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులను తీసుకొని గురువారం ఉదయం 11 గంటలకు గజపతినగరం ఐసిడిఎస్ పిఒ నాగమణి వద్దకు సౌజన్య వెళ్లారు. తాను మీటింగ్‌లో ఉన్నానని, తరువాత వచ్చి తీసుకుంటానని చెప్పారు. మధ్యాహ్నం 2గంటల సమయంలో తాను ఆ ఉత్తర్వులు తీసుకునేది లేదని కార్యాలయ సిబ్బందితో చెప్పించారు. దీంతో స్పందించిన యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి విలేకర్లతో మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వులు తీసుకునేందుకు నిరాకరిస్తున్న పిఒ రేపు సౌజన్యతో ఏ విధంగా ఉద్యోగం చేయిస్తారా అని భయం కలుగుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 2.30గంటల వరకు చంటిపిల్లతో పిఒ కార్యాయలయం వద్ద సౌజన్యం వేచి ఉంటే ఉత్తర్వులు తీసుకునేందుకు నిరాకరించడం సరైనది కాదని అన్నారు. శిక్షణకు వచ్చిన అంగన్‌వాడీలను ఎటువంటి ధర్నాలకు వెళ్లవద్దని వారిని బెదిరించి సంతకాలు తీసుకోవడం ఆమె దౌర్జన్యానికి పరాకష్ట అని అన్నారు. అనంతరం అంగన్‌వాడీలంతా పిఒను ప్రశ్నించడంతో కార్యాలయం సిబ్బంది ఆ ఉత్తర్వు కాపీని తీసుకున్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి అన్ని రకాలుగా అంగన్‌వాడీలను ఇబ్బంది పెడుతున్న పిఒను సస్పెండ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి పి.జ్యోతి పాల్గొన్నారు.

అంగన్వాడీలకు జనవరి జీతాలు వెంటనే చెల్లించాలి

విజయనగరం టౌన్ : రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీలకు జనవరి నెల జీతాలు ఇచ్చినా విజయనగరం జిల్లాలో చెల్లించలేదని, వెంటనే ఇప్పించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పైడిరాజు, ఎస్.అనసూయ, గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి అధికారులను కోరారు. ఈమేరకు బుధవారం డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తికి వినతిని అందజేశారు. జీతాలు ఇవ్వకపోవడం వల్ల కుటుంబాలతో కలిసి పండుగ జరుపుకునే అవకాశం లేకుండా పోతుందని తెలిపారు. ఐసిడిఎస్ పీడీ సెలవులో ఉండడం, ఇన్‌ఛార్జి పీడీ డిజిటల్ సంతకం లేనందున సాంకేతిక కారణం చూపి జనవరి నెల జీతాలు వేయలేదన్నారు. కావున ఈ సమస్యలు పరిష్కరించి జీతాలు వెంటనే వేయించే చర్యలు చేపట్టాలని వారు కోరారు.

గుంతలు లేని రహదారులుగా 296 కిలోమీటర్లు

రెండో విడత పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

పల్లె పండగలో భాగంగా గుంతలు లేని రహదారులే లక్ష్యంగా జిల్లాలో చేపట్టిన రోడ్ల మరమ్మతు పనులు 296 కిలోమీటర్ల మేర పూర్తి అయ్యాయని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. రోడ్ల మరమ్మతు పనులపై రహదారులు భవనాల శాఖ అధికారులతో కలెక్టర్ అంబేద్కర్ తమ ఛాంబర్‌లో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 884 కిలోమీటర్ల మేర రహదారుల మరమ్మతులకు 176 పనులను ప్రతిపాదించడం జరిగిందని చెప్పారు. వీటిలో మొదటి విడత 296 కిలోమీటర్ల మేర సుమారు రూ.10.54 కోట్ల ఖర్చుతో చేపట్టిన 68 పనులు గురువారం నాటికి పూర్తి అవుతాయిని చెప్పారు. ఇవన్నీ అనుకున్న లక్ష్యం మేరకు సంక్రాంతి పండుగ నాటికి సిద్ధమయ్యాయని తెలిపారు. రెండో విడత కింద రూ.13కోట్లతో 588 కిలోమీటర్ల మరమ్మతు కోసం 108 పనులు ప్రారంభించగా, ఇప్పటివరకు సుమారు 106 కిలోమీటర్ల మేర పూర్తి అయ్యాయని తెలిపారు. మిగిలిన పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో ఆర్ అండ్ బి ఎస్ఈ కాంతిమతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

బిసి-డి నుంచి బిసి-ఎకు మార్చాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గవరలను బిసి-డి నుంచి బిసి-ఎ కు మార్చాలని గవర జాతికి రిజర్వేషన్ కల్పించాలని గౌరీ సేవసంఘం అధ్యక్షులు ఎం కె బి శ్రీను డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంతపేట, గవర వీధి వద్దనున్న శ్రీ జగన్నాథ స్వామి వారి ఆలయంలో ఆ సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండరును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో కూడా రాష్ట్ర గవర కార్పొరేషన్ ను ఏర్పాటు చేసి, మళ్ళ సురేంద్రను చైర్మన్ గా 12మంది డైరెక్టర్లను నియమించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సంఘ ప్రధాన కార్యదర్శి మొల్లేటి చిన్నారావు నాయుడు, కోశాధికారి బొడ్డేటి సంతోష్ కుమార్ మాట్లాడుతూ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతీ రోజు పేదలకు గత నిత్యాన్న దానం చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో నిత్యాన్నదానం చైర్మన్, సంఘ గౌరవ అధ్యక్షులు కాంద్రేగుల శేఖర్, ఆడారి నగేష్, కనిశెట్టి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌టి కమిషన్ చైర్మన్‌ను కలిసిన డిఎస్‌టిడబ్ల్యుఇఒ

ప్రజాశక్తి-విజయనగరం

విజయనగరం క్యాంప్ కార్యాలయంలో ఎస్‌టి కమిషన్ చైర్మన్ డివిజి శంకర్రావును డిఎస్‌టిడబ్ల్యుఇఒగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కె.శ్రీనివాసరావు మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఉన్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో స్థితిగతులపై, పిల్లల ఆరోగ్య సంరక్షణపై, పదో తరగతి విద్యార్థులకు రానున్న పరీక్షల కోసం చేస్తున్న సన్నద్ధతపై చైర్మన్ ఆరా తీశారు. పివిటిజి గ్రామాల్లో అమలుతున్న అభివృద్ధి కార్యక్రమాలు,పెండింగ్ లో ఉన్న అటవీ హక్కులు, భూసంబంధిత సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. జిల్లా ఆస్పత్రిలో ట్రైబల్ సెల్ ఏర్పాటుకు ఐటిడిఎ ఉన్నతాధికారులతో సంప్రదించాలని సూచించారు. త్వరలో పాఠశాలలు, గ్రామాలు సందర్శించి అధికారులతో సమీక్ష చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారితో బాటు వసతి గృహ సంక్షేమ అధికారి సంతోష్ కుమార్, హెచ్‌డబ్ల్యుఒలు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని డిఎస్‌సి ఇండోర్ స్టేడియంలో బాడ్మింటన్ కోచ్ గుంట్రోతు శ్రీనివాసరావు, ఆర్‌జిఆర్ నిఖిల్ రచించిన 'బ్యాడ్మింటన్ స్ట్రోక్ ఎనాలిసిస్ అండ్ లెర్నింగ్ ' అనే పుస్తకాన్ని డిఎస్‌డిఒ ఎస్ వెంకటేశ్వరరావు జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కొండపల్లి అప్పలనాయుడు, ,సహాధ్యక్షులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్, ఎం కె బి శ్రీను వై.కుసుమ బచ్చన్, కార్యదర్శి నున్న సురేష్, ఆర్గనైజింగ్ కార్యదర్శి సిహెచ్ కుటుంబరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ వి ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక కోచ్ గా అనేకమంది క్రీడాకారులను రాష్ట్ర జాతి స్థాయికి తయారు చేస్తూ బ్యాడ్మింటన్‌పై ఇటువంటి పుస్తకం రచించడం అనేది చాలా అరుదని అన్నారు. కెఎ నాయుడు మాట్లాడుతూ జిల్లాకు ఎంతోమంది బ్యాడ్మింటన్ క్రీడాకారులను తయారు చేస్తున్న శ్రీనివాసరావు నిఖిల్‌ను భావి తరాల జూనియర్ కోచ్‌లకు ఈ విధంగా కోచింగ్ తర్ఫీదు ఇవ్వాలనే దృక్పథంతో రాసిన ఈ పుస్తకం ఎంతోమంది కి ఉపయోగపడుతుందని కొనియాడారు.

విశాఖ సాక్షిగా మరోసారి ద్రోహం

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి శ్రీనివాస

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విశాఖ సాక్షిగా మోడీ మరోసారి ద్రోహం చేసారని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడీ ప్రసంగంలో రాష్ట్రాన్ని వేధిస్తున్న సమస్యలపై స్పందించక పోవడం తీవ్ర నిరాశకు గురి చేసిందని, ఆర్భాటంగా ఏర్పాటు చేసిన సభ, రోడ్ షోలకు తగ్గట్లుగా ప్రజలకు చేసిన మేలు లేదని పేర్కొన్నారు. ఆయన పదేపదే ప్రస్తావించిన గ్రీన్ ఎనర్జీ ప్రాజక్టు నిర్మాణం, ఆయన విధాన పరంగానే ద్వేషించే, ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమ అయిన ఎన్‌టిపిసి ద్వారా జరగడం ద్వారా ప్రభుత్వ రంగ ప్రాధాన్యత తెలుస్తోందన్నారు. గత నాలుగేళ్లుగా కార్మికులు పోరాడుతున్నా మోడీ విశాఖ స్టీల్ ప్లాంట్ ఊసే ఎత్తలేదని, విభజన చట్ట ప్రకారం రావలసిన విశాఖ మెట్రో రైల్ మాట కూడా మాట్లాడలేదని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీల సంగతి పూర్తిగా మరిచారని పేర్కొన్నారు. పక్కనే ఉన్న ముఖ్య మంత్రి చంద్రబాబు. ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కనీసంగా కూడా అడగలేదు సరికదా, ఆయనను ప్రసన్నం చేసుకోవడానికే ఇద్దరూ పోటీ పడ్డారని విమర్శించారు. ముచ్చటగా ముగ్గురూ కలిపి ఈ సభా వేదికగా ఆంధ్ర రాష్ట్రానికి మోసం చేశారని తెలిపారు.. సభంతా ఒకర్నొకరు పొగుడుకోవడంతోనే సరిపోయిందని, ప్రజలు వద్దు మొర్రో అంటున్న నక్కపల్లి బల్క్ డ్రగ్స్ ప్లాంటుకు శంకుస్థాపన చేశారని, నిర్వాసితుల ఊసెత్తకుండా గ్రీన్ ఎనర్జీ, అత్యధిక ఆదాయం గడిస్తున్న విశాఖ రైల్వే డివిజన్ కొనసాగించాలని ఎంత కోరినా దాన్ని పక్కన పెట్టారని పేర్కొన్నారు. పదేళ్ళ నుండి ఊరిస్తూ, ఊరిస్తూ ఎట్టకేలకు రైల్వే జోన్ కు శంకుస్థాపన చేయడంలో గర్వ పడవలసిన దేముంది? పదేళ్ళ క్రితం రావలసినది ఇంత ఆలస్యం చేసినందుకా? అని విమర్శించారు. స్టీల్ ప్లాంటుపై ప్రధాని ప్రకటన చేయాలని కోరుతూ, ప్రదర్శన చేస్తున్న వామపక్ష నాయకులను అరెస్టు చేయడం, ముందు రోజు నుండే సిపిఎం నాయకులను గృహ నిర్బంధం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇప్పటికైనా స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకుని, సెయిల్ లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

మతోన్మాద శక్తుల నుండి లౌకిక దేశాన్ని కాపాడుకుంటాం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మతోన్మాద శక్తుల నుంచి లౌకిక భారత దేశాన్ని కాపాడుకుంటామని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అన్నారు. రాజ్యాంగాన్ని నాశనం చేసేందుకు ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునేందుకు ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. దేశ సమైక్యత, మతసామరస్యం, రాజ్యాంగ పరిరక్షణకై దేశ వ్యాప్తంగా సిపిఎం చేపట్టిన ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం పూల్ బాగ్, డాబతోట, గాజులరేగ, తదితర చోట్ల ప్రచారం చేపట్టారు. మతోన్మాద చర్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు వి.రామచంద్రరావు, రామలక్ష్మి పాల్గొన్నారు.

పేద విద్యార్థికి సిరి సహస్ర ఆర్థిక సాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మెరకముడిదాం మండలం ఎం.గదబవలసకు చెందిన తుమరాడ దీపికకు విశాఖలోని మల్కాపురంలో గల సెయింటు ఆనమ్స్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ లో సీటు వచ్చింది. అందులో చదువుకోవడానికి ఫీజు నిమిత్తం బుధవారం చిన్న శ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరి సహస్రను ఆర్థిక సహాయం కోరగా వెంటనే ఆమె స్పందించి సాయమందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణతో చదువుకుంటే మంచి ఫలితం వస్తుందన్నారు. మెరిట్ విద్యార్థులకు సహాయం చేసేందుకు తమ సంస్థ ఎప్పుడూ అందుబాటులో ఉంటుందని, ప్రతిభను ప్రోత్సహించడమే తమ సంస్థ ధ్యేయమని చెప్పారు.

సమ్మె ఒప్పందాల అమలుకు

రేపు మున్సిపల్ కార్మికుల నిరసన దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

2023 డిసెంబర్ 26 నుంచి జనవరి 10 వరకు రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వంతో జరిగిన రాతపూర్వక ఒప్పందాలకు తక్షణమే జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఈనెల 10న విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన దీక్ష చేపట్టనున్నట్లు యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ .జగన్మోహన్‌రావు తెలిపారు. బుధవారం మధ్యాహ్నం మున్సిపల్ మస్టర్ పాయింట్ల వద్ద కార్మికులను కలిసి కరపత్ర ప్రచారం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరపాలక సంస్థలో 60 సంవత్సరాలు దాటి అనేక కారణాలతో 12 మందిని రిటైర్మెంట్ చేశారని, మరో 20 మంది అనారోగ్యంతో మరణించారని, వారి కుటుంబంలో ఉపాధి కల్పించకుండా ఉన్న కార్మికుల పైనే పని భారం పెంచుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేసిన కార్మికులకు ఆయన పని చేసిన కాలానికి గ్రాట్యూటీ లెక్క కట్టి చెల్లిస్తున్నారని, ప్రభుత్వ సంస్థలో అందునా మున్సిపల్ ప్రజారోగ్య వ్యవస్థలో పనిచేసి తమ ఆరోగ్యాన్ని పణంగా పెట్టి ప్రజల ప్రాణాలకు రక్షణగా నిలుస్తున్న కార్మికులకి ఎలాంటి భద్రత, భరోసా కల్పించకుండా తొలగించడం ప్రభుత్వమే చట్టాన్ని ఉల్లంఘించడమేనని అన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్ కల్పించలేక పోతే ప్రభుత్వ ఉద్యోగి మాదిరి అందర్నీ 62 ఏళ్ల వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించిన జీవో నెంబర్ 2ను సవరించి కాంట్రాక్ట్ ,ఔట్ సోర్సింగ్ ,డైలీ వేజ్ కార్మికులందరికీ మినిమం టైం స్కేల్ వర్తించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ ఉద్యోగుల కార్మికుల మూడు సంవత్సరాల సరెండర్ లీవ్ డబ్బులు , డిఎ బకాయిలు చెల్లించాలని ,జిపిఎస్ అకౌంట్లు తెరవాలని , మట్టి ఖర్చులు, ఎక్స్‌గ్రేషియో పెంపు జీవోలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన దీక్ష చేపడుతున్నామని తెలిపారు. మున్సిపల్ కార్మికులు ఉద్యోగులు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు .కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు శంకర్రావు, ఈశ్వరమ్మ, కుమారి, నాగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటుదాం

ప్రజాశక్తి- బొబ్బిలి

తెలుగు భాష ఔన్నత్యాన్ని ముందు తరాలకు చాటి చెప్పేలా కృషి చేయాల్సిన బాధ్యత తెలుగు ప్రజలపై ఉందని రోటరీ డిస్ట్రిక్ట్ చైర్మన్, కారుణ్య ఫౌండేషన్ అధినేత జెసి రాజు పిలుపు నిచ్చారు. బుధ, గురు వారాల్లో రాజమండ్రిలో నిర్వహించనున్న ప్రపంచ తెలుగు మహా సభలు ప్రారంభ వేడుకల నేపథ్యంలో తెలుగు భాష గొప్పతనాన్ని నలు దిశలా చాటిచెప్పేలా, తెలుగు మహాసభలు విజయవంతం కావాలని కోరుతూ బుధవారం స్థానిక తెలుగు తల్లి విగ్రహానికి పూల మాలలు వేసి తెలుగును బ్రతికించుకుందాం అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రాజ కళాశాల తెలుగు అధ్యాపకులు డాక్టర్ బొంతు శ్రీ రాములు మాట్లాడుతూ ప్రపంచ తెలుగు మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రమంతా తెలుగు భాషాభివృద్ధి, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. జెసిరాజు మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో తెలుగు భోధనకు, తెలుగు మాధ్యమానికి ప్రాముఖ్యత నివ్వాలన్నారు. తెలుగు మాధ్యమంలో చదివిన విద్యార్థులకు పోటీ పరిక్షాల్లోనూ, ఉద్యోగాల్లోనూ సముచిత ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి సిహెచ్‌జె ప్రవీణ్ కుమార్, రోటరీ కార్యనిర్వాహక కార్యదర్శి కె రామకృష్ణ, మల్టీ టెలెంటెడ్ గ్రూప్ అధ్యక్షులు కరుణ కుమార్, అప్పలనాయుడు, శ్రీనివాసరావు, రాంపా రాజమోహన్ విద్యార్థులు పాల్గొన్నారు.

రికార్డులను పరిశీలిస్తున్న డిఎంహెచ్ఒ జీవనరాణి

డెంకాడ పిహెచ్‌సిలో తనిఖీలు

ప్రజాశక్తి- డెంకాడ

డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా వైద్యాధికారి జీవన రాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి రికార్డులను పరిశీలించి సిబ్బంది హాజరు పట్టికను తనిఖీ చేశారు. టీకాల నిల్వ ఉంచే విధానం పరిశీలించి ఫార్మాషిస్ట్‌కు సూచనలు చేశారు. డెంకాడ పరిధిలో అమలు చేస్తున్న ఆరోగ్య కార్యక్రమాలు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో అంటువ్యాధులు సోకాకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని వైద్యాధికారి శివరామకృష్ణను ఆదేశించారు. అనంతరం డెంకాడ గ్రామంలో పిల్లలకు వేస్తున్న వ్యాక్సిన్ల తీరును పరిశీలించారు. ఈమెతో పాటు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ రాజు, హెల్త్ ఎడ్యుకేటర్ అనికుమార్, హెల్త్ పర్యవేక్షకుడు సూరి అప్పారావు, సిహెచ్ఒ యాసయ్య, ఫార్మాషిస్ట్ అప్పలనాయుడు, స్టాఫ్‌నర్స్ మీనా కుమారి, ఎల్‌టి గోవింద్, సీనియర్ అసిస్టెంట్ దుర్గారావు, పిహెచ్‌ఎన్ వరలక్ష్మి ఉన్నారు.

చర్యలు తీసుకుంటాం

డెంకాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిశీలనకు వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జీవన్ రాణిని మండలంలోని మోపాడ పిహెచ్‌సిలో జరుగుతున్న పరిణామాలపై ప్రజాశక్తి పత్రికలో వచ్చిన కథనాలపై ప్రశ్నించగా వాటన్నింటిపై విచారణ జరుగుతుందని, విచారణలో పత్రికల్లో వచ్చింది వాస్తవం అయితే చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

మారిక రోడ్డు పనుల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామానికి నిర్మిస్తున్న రోడ్డు పనులను బుధవారం తహశీల్దార్ జె. రాములమ్మ పరిశీలించారు. ఎన్నో ఏళ్లుగా గిరిజనులు పోరాటం ఫలితంగా రోడ్డు నిర్మాణం జరుగుతోందని నాణ్యతా లోపాలు లేకుండా పనులు పూర్తి చేయాలని ఆమె ఆదేశించారు. ఈ పరిశీలనలో సిపిఎం నాయకుడు చల్లా జగన్, మండల సర్వేయర్ గంగాధర్, ఎంఆర్ఐ రామలక్ష్మి, ఏఎస్ఒ రాజు, రెవెన్యూ అధికారులు సత్యవతి, బాల భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి, గిరిజనులు, పాల్గొన్నారు.

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

ప్రజాశక్తి - రామభద్రపురం

రహదారి భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలని హెచ్ఐ ఇన్ఫ్రా ఇంజనీరింగ్ లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ అరుణ్ రాజశేఖర్ సూచించారు. మండల కేంద్రంలోని బైపాస్ రోడ్డు వద్ద బుధవారం రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా వాహనాలకు రేడియం అతికించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ రహదారి భద్రతపై తీసుకొనే జాగ్రత్తల వల్ల వాహనదారులతోపాటు వారి కుటుంబ సభ్యులకు కూడా రక్షణ ఉంటుందన్నారు. వాహన, వాహనానికి మధ్య దూరం పాటించడం, ఓవర్టేక్ చేసేటప్పుడు ఎదురుగా వస్తున్న వాహనాలను చూసుకోవడం, ముఖ్యంగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం వంటి జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. 36వ జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవం ఈనెల 1 నుంచి 31వ తేదీ వరకు చేపడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీమ్ లీడర్ అంబళ్ల రవికుమార్, కంపెనీ ఉద్యోగులు రంజిత్ సింగ్, సాతబ్ అలాం, సంతోష్ పాండే, వినయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు

కౌలు రైతుల రుణాలకు సిఫార్సు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలో ఈ ఏడాది రబీ సీజన్‌లో కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని ఎఒ వెంకటయ్య తెలిపారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఈ ఏడాది 542 మంది కౌలు రైతులకు రుణాలు అందివ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే అర్హత ఉన్నవారి పేర్లను బ్యాంకర్లకు అందించామన్నారు. ఈ ఏడాది 4,500 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, ధాన్యం అమ్మకాలు చేసిన రైతులకు 48 గంటల్లోనే బిల్లులు చెల్లించామని చెప్పారు. ఈ సమావేశంలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ కొండలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కిశోర బాలికల ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రజాశక్తి- బొండపల్లి

కిశోర బాలికల ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలని గంట్యాడ ఐసిడిఎస్ పిఒ ఉమాభారతి కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో కిశోర వికాసంపై బుధవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు యుక్త వయసు వచ్చినప్పుడు శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకుంటాయన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, రక్త హీనతపై దృష్టి పెట్టాలన్నారు. పోషకాహారం తీసుకోవడం వల్ల రక్తహీనత నివారించవచ్చునని గుర్తు చేశారు. బాల్య వివాహాలు, లింగ నిర్ధారణ చట్ట రీత్యా నేరమన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ జి.గిరిబాల, ఎంఇఒ శోభారాణి, సచివాలయ సిబ్బంది, అంగన్వాడీలు, ఆశాలు పాల్గొన్నారు.

పోక్సో కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-విజయనగరంకోట

విజయనగరం మహిళా పోలీసు స్టేషన్లో 2021లో నమోదైన పోక్సో కేసులో నిందితులు విజయనగరం పట్టణానికి చెందిన కోడూరు విజయకుమార్ (36), కోడూరు శైలజ (32)కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ పోక్సో ప్రత్యేక న్యాయమూర్తి కె.నాగమణి తీర్పుచెప్పారు. నగరంలోని విటి అగ్రహారం బిసి కాలనీకి చెందిన 13ఏళ్ల బాలిక తల్లిదండ్రులు గొడవపడి విడిపోయారు. తరువాత బాలిక తల్లి విజయనగరం పట్టణం గాడీఖానా రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న నిందితుడు కోడూరు విజయ కుమార్‌తో ఉంటోంది. బాలిక మాత్రం బిసి కాలనీలో ఉంటున్న అమ్మమ్మ దగ్గర ఉంటూ చదువుకుంటోంది. అమ్మ ఒడి డబ్బులు విషయమై ఆ బాలిక శైలజ వద్దకు వెళ్లింది. ఆ సమయంలో విజయ్‌కుమార్ బాలికను లైంగికంగా వేధించగా, అందుకు తల్లి శైలజ సహకరించినట్లు బాలిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి నిందితులకు మూడేళ్ల జైలుశిక్ష, రూ.2500 జనిమానా విధించారు.

రైలు కింద పడి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి- బాడంగి

డొంకినవలస రైల్వే స్టేషన్ దగ్గర ఫ్లాట్‌ఫామ్‌పై నుంచి జారిపడి డొంకినవలస గ్రామానికి చెందిన బంకురు సూర్యనారాయణ (71) మృతి చెందాడు. బొబ్బిలి జీడీపీ హెచ్‌సి ఈశ్వరరావు చెప్పిన వివరాలు ప్రకారం.. బుధవారం సాయంత్రం బొబ్బిలి నుంచి వస్తున్న గూడెసు రైలు ఫ్లాట్‌ఫామ్ వద్దకు వచ్చే సరికి అప్పటికే ఫ్లాట్‌ఫామ్ పై ఉన్న సూర్యనారాయణ కాలుజారి ఒక్కసారిగా పట్టాలపై పడిపోయాడు. దీంతో రైలు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి బార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అసంపూర్తిగా అంగన్వాడీ కేంద్రాలు

● ఏడేళ్లుగా ముందుకు కదలని భవన నిర్మాణ పనులు ●ఇంకా అద్దె కొంపల్లోనే నిర్వహణ ●పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని 2017లో మంజూరైన అంగన్వాడీ భవనాలు ఇప్పటికీ అసంపూర్తిగానే మిగిలి ఉన్నాయి. దీంతో అంగన్వాడీ కేంద్రాలను అద్దె భవనాలు, పంచాయతీ కార్యాలయాల్లోనే నడుపుతున్నారు. అసంపూర్తిగా ఉన్న భవనాలకు కొద్దిపాటి నిధులను వెచ్చిస్తే పనులు పూర్తవుతాయని, అయినప్పటికీ ఆ దిశగా అధికారులు దృష్టి సారించడం లేదని పలువురు విమర్శిస్తున్నారు. సుమారు ఏడేళ్లయినా ఈ భవనాలవైపు కన్నెత్తి చూడకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట అని పలువురు భావిస్తున్నారు.

మండలంలోని 64 అంగన్వాడీ సెంటర్లు ఉండగా వీటిలో 34 అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. అద్దె భవనంలో ఉన్న వాటికి శాశ్వత భవనాలు నిర్మించాలని ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. అయితే పనులు మాత్రం పూర్తి కాలేదు. నర్సాపురం, పాతరేగ, కొండకెంగువ, కొట్టక్కి,

అసంపూర్తిగా ఉన్న నర్సాపురం అంగన్వాడీ భవనం

అప్పలరాజుపేట తదితర గ్రామాల్లో గతంలో మంజూరైన ఈ భవనాలు ఫినిషింగ్ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. స్వల్ప నిధులు వెచ్చిస్తే ఈ భవనాలు ప్రారంభోత్సవానికి నోచుకుంటాయని నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు తెలిపారు. అయినప్పటికీ సంబంధిత శాఖాధికారులు వీటిపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో తెలియడం లేదని వాపోయారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి భవన నిర్మాణాలను పూర్తి చేయాలని కోరుతున్నారు.

మండల సర్వసభ్య సమావేశాల్లో ప్రశ్నించినా..

ప్రతి మండల సర్వసభ్య సమావేశాల్లోనూ ఈ అసంపూర్తి భవనాలపై ఆయా గ్రామాల ప్రజాప్రతినిదులు అధికారులను నిలదీస్తున్నా ఉపయోగం లేకపోతోంది. మరికొన్ని గ్రామాల్లో అద్దెకు ఇచ్చిన అంగన్వాడీ కేంద్రాల యజమానులు తమ ఇళ్లు ఖాళీ చేయాలని నిర్వాహకులపై ఒత్తిడి చేయడం, మరికొన్ని భవనాలు శిధిలావస్థకు చేరడంతో అంగన్వాడీలకి నిర్వహణ ఇబ్బందిగా ఉంది. దీనిపై ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మిని వివరణ కోరగా అసంపూర్తి భవనాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపడుతున్నామని, మరికొన్ని భవనాలకు ప్రతిపాదన కూడా పంపించామని తెలిపారు.

మున్సిపల్ అవినీతిపై దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కన్వీనర్ పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో రోడ్లపై ఏర్పడిన గోతులను పూడ్చేందుకు రూ.50లక్షలు కేటాయించి క్రషర్ బుగ్గి వేసి అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. ప్రజల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను ప్రజలకు ఉపయోగపడేలా ఖర్చు చేయకుండా అవినీతికి పాల్పడడం అన్యాయమన్నారు. గోతులను పూడ్చడానికి రూ.50లక్షలు ఖర్చు చేసి పూర్తిగా గోతులను పూడ్చలేదని విమర్శించారు. రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై గోడ పెయింటింగ్స్‌కు రూ.18లక్షలు, రోడ్డుపై ఉన్న డివైడర్‌పై రంగులు వేసేందుకు రూ.10లక్షలు కేటాయించి నాసిరకం పనులు చేసి అవినీతికి పాల్పడుతున్నారని అన్నారు. సొంత వాహనాలకు డీజిల్ కొట్టించి మున్సిపల్ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు యూనిఫాం ఇవ్వాలని కోరితే నిధులు లేవని చెపుతున్న అధికారులు నాసిరకం పనులకు జనరల్ ఫండ్

సిపిఎం డిమాండ్

రోడ్డును పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

నుంచి బిల్లులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. జిల్లా అధికారులు స్పందించి మున్సిపల్ అక్రమాలపై సమగ్ర దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఆయనతో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, పరశురామ్ ఉన్నారు.

గోతుల రోడ్డును పరిశీలించిన నాయకులు

పట్టణంలోని పూల్ బాగ్ రోడ్డుపై ఉన్న గోతులను సిపిఎం పట్టణ కన్వీనర్ పి.శంకరరావు, మండల కన్వీనర్ ఎస్.గోపాలం, నాయకులు సురేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్లపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, నూతనంగా రోడ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు. గోతులను ఇళ్ల నిర్మాణ వ్యర్థాలతో పూడ్చడం సరికాదన్నారు.

20 లక్షలు సరిపోతాయి..

బొబ్బిలి మున్సిపాలిటీలో రోడ్డుకు పడిన గోతులను కప్పడానికి రూ.20లక్షలు సరిపోతాయని, రూ.50 లక్షలు ఎలా ఖర్చు చేశారని కాంగ్రెస్ నియోజకవర్గ ఇంఛార్జి ముద్వల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. బొబ్బిలి మున్సిపాలిటీలో తారాస్థాయిలో అవినీతి జరుగుతోందని చెప్పడానికి ఇదే ఉదాహరణ అన్నారు. రూ.50లక్షలతో ఏ స్టాండర్డ్ ప్రకారంగా గోతులు కప్పుతున్నారో ప్రజలకు వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. క్రషర్ బుగ్గితో ఉమ్ముతడి పనిచేసి నాయకులు అధికారులు ప్రజాధనాన్ని పంచుకుంటున్నారని ఆరోపించారు. కోట్లాది రూపాయలు అన్యాక్రాంతం అవుతుంది తప్ప బొబ్బిలి పట్టణం ఏ కోసానా అభివృద్ధి జరగలేదని మండిపడ్డారు.

10న జాబ్ మేళా

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో ఈనెల 10న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ప్రభుత్వ ఐ.టి.ఐ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి జిల్లా అధికారి జి.ప్రశాంత్ కుమార్ చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ఐటిఐ, టెన్త్, ఇంటర్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసి 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. జాబ్ మేళాకు పటేల్ రైలు, స్పందన స్ఫూర్తి ఫైనాన్స్ లిమిటెడ్, స్విగ్గి వేర్ హౌస్ మొదలగు బహుళ జాతి కంపెనీలు వస్తాయన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8790118349, 9988853335ను సంప్రదించాలన్నారు.

అప్పారావుకు అభినందనలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సింగరాయి గ్రామానికి చెందిన సామాజిక వేత్త రిక్కి అప్పారావుకు ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు బుధవారం అభినందనలు తెలిపారు. అప్పారావు నిస్వార్థంతో పార్టీలకు అతీతంగా మండలంలో ఉన్న పలు సమస్యలపై పోరాటం చేస్తున్నారని, పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను ఉన్నతాధికారులు, మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ రైల్వే ఉద్యోగులు రిక్కి సముద్రం, డాక్టర్ రిక్కి రిషియా, కె. దేవుడమ్మ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని సోంపురంలో వంద రోజులు టిబి వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం వైద్య సిబ్బంది గ్రామస్తులకు క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 60 సంవత్సరాలు పైబడిన వారికి క్షయకు సంబంధించిన వైద్య పరీక్షలను చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంగరాజు, వెల్నెస్ సెంటర్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యం కాపాడుకుందాం

ప్రజాశక్తి- మెంటాడ

మత సామరస్యాన్ని కలిసికట్టుగా కాపాడుకుందామని సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు కోరారు. సిపిఎం ప్రచార కార్యక్రమాన్ని బుధవారం లోతు గెడ్డ గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ దేశానికి మతోన్మాద ప్రమాదం పెరుగుతుందన్నారు. మెజారిటీ హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టి మైనారిటీలపై దాడి చేసి మత ఐక్యతకు దెబ్బతీసి ప్రజలను చీల్చి బిజెపి పాలన సాగించాలని నిర్ణయానికి వచ్చిందన్నారు. మతోన్మాద గొడవలను ఆసరాగా తీసుకుని ప్రజలను అనైక్యతవైపు నెట్టివేస్తూ క్రమక్రమంగా ఈ గందరగోళంలో భారత దేశ సంపదను ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు అప్పగించే కుట్రకు పూనుకుం టుందన్నారు. అందుకనే భారత దేశ స్వాతంత్రో ద్యమంలో పాల్గొనకుండా బ్రిటిష్ వారికి సహకరించిన ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలు చేస్తుందన్నారు. మనుధర్మ శాస్త్ర రాజ్యాంగాన్ని అమలు

మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాకోటి రాములు

చేయాలని అనేక ఏళ్లుగా తహతలాడుతుందన్నారు. ఇందులో భాగంగానే అంబేద్కర్‌ని అవమానించడం గిరిజనుల ప్రత్యేక హక్కులను 1/70 చట్టానికి తూట్లు పొడుస్తూ రాజ్యాంగంలో మార్పులు తీసుకురావాలని గత 20 ఏళ్లుగా బిజెపి చూస్తోందన్నారు. ప్రజలను ఐక్యం చేసి మతసామరస్యాన్ని కాపాడుకోవలసిన బాధ్యతను దృష్టిలో పెట్టుకొని మతవిద్వేషాలకు వ్యతిరేకంగా నిలబ డాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ కృష్ణవేణి, రమేష్, చిన్నమ్ములు, బంగారు సింహాచలం, ఆర్ కృష్ణవేణి పాల్గొన్నారు.

ముగిసిన రెవెన్యూ సదస్సులు

ప్రజాశక్తి - వేపాడ

సుమారు నెల రోజులుగా మండలంలో నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు బుధవారంతో ముగిశాయి. ఆఖరి రోజు మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలో గల మారిక గిరిజన గ్రామంలో రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ముందుగా గ్రామంలో రెవెన్యూ సదస్సుల వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ జె.రాములమ్మ మాట్లాడుతూ రైతులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి సుమారు 8 కిలోమీటర్లు నడిచి వచ్చి ఈ సదస్సును ఏర్పాటు చేశామన్నారు. భూమి కలిగి ఉన్న ప్రతి రైతుకు న్యాయం చేయాలని ఉద్దేశ్యంతో సదస్సు పెట్టామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఆర్ఐ రామలక్ష్మి, మండల సర్వేయర్ గంగాధర్, ఎఎస్ఒ రాజు, గ్రామ రెవెన్యూ అధికారులు సత్యవతి, బాల భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి సచివాలయ సర్వేయరు తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి

రెవెన్యూ అక్రమాలపై చర్యలు చేపట్టి గిరిజన రైతులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు చల్లా జగన్ అధికారులను కోరారు. మారిక గిరిజన భూముల్లో దేవరపల్లి

ర్యాలీ చేస్తున్న అధికారులు, గ్రామస్తులు

మండలం చింతలపూడి గ్రామానికి చెందిన మహిళచే ఒక కంపెనీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించారని వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి గిరిజనలకు వారి భూములను అప్పగించాలని డిమాండ్ చేశారు. సుమారు 50 ఎకరాల గిరిజనుల భూమిని పాసు పుస్తకాలు చేస్తామని నమ్మించి వేరే ఒకరి పేరు మీద రిజిస్ట్రేషన్ చేయడం దుర్మార్గమన్నారు. ఆయన వెంట గిరిజన నాయకులు వీర్రాజు, సోమేశ్, బాబురావు, అప్పలనాయుడు తదితరులు ఉన్నారు.

ఒప్పంద జిఒల కోసం 10న నిరసన దీక్ష

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మున్సిపల్ సమ్మె ఒప్పంద జిఒల కోసం ఈనెల 10న నిర్వహించే నిరసన దీక్షలు విజయవంతం చేయాలని మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగమోహన్ రావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమ్మె ఒప్పందాల్లో భాగంగా గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలన్నింటికీ వెంటనే జిఒలు ఇవ్వాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా జనవరి 10న స్థానిక నగర పంచాయతీ కార్యాలయం వద్ద జరిగే నిరసన దీక్షల్లో మున్సిపల్ కార్మికులు, ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్, థర్డ్ పార్టీ విధా నంలో ఉన్న కార్మికులందరినీ మినిమం టైం స్కేల్ పరిధిలోకి తీసుకొచ్చే విధంగా జిఒ నెంబర్2లో సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత జిఒతో ఎక్కువ మంది కార్మికులకు పిఆర్‌సి వర్తించదని ఆందోళన వ్యక్తం చేశారు. 12వ పిఆర్‌సిని తక్షణమే ప్రకటించి, గత ప్రభుత్వం

కరపత్రాలను విడుదల చేస్తున్న నాయకులు

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలకు తక్షణమే జిఒలు ఇవ్వాలని, పర్మినెంట్ ఉద్యోగులు మాదిరిగానే 62ఏళ్ల వరకు కొనసా గించాలని, ఇటీవల మరణించిన తుపాకుల రవణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నిరసన దీక్ష చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం సంబంధిత కరపత్రాన్ని విడుదల చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు దుర్గా రావు, శ్రీను, విక్రం, రామునాయుడు, రాము, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని సభ.. ట్రాఫిక్ ఇక్కట్లు

ప్రజాశక్తి- భోగాపురం

విశాఖలో జరిగే ప్రధాని సభ నేపథ్యంలో జిల్లాలోని జాతీయ రహదారిపై విశాఖ వెళ్లే వాహనాలను పోలీసుల ఎక్కడికక్కడ నిలిపివేశారు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పూసపాటిరేగ, భోగా పురం టోల్ గేట్ సమీపంలో వాహనాలను ఆపి మరీ చెక్ చేసి నిలిపివేశారు. భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ, ఎస్ఐలు దుర్గ ప్రసాద్, పాపారావుల ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. టోల్గేట్ వద్ద శ్రీకాకుళం నుంచి వచ్చే బస్సులతో భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. బస్సులన్నీ ఇక్కడే భోజనాల కోసం ఆపడంతో ఈ సమస్య ఏర్పడింది. దీంతో వెంటనే పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను సరిదిద్దారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన బస్సుల్లో భోజనాలు సరిగా అందక కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. భోజనం చేసిన అనంతరం వాటర్

హైవే రోడ్డుపై నిలిచిపోయిన బస్సులు

బాటిళ్లు, ప్లాస్టిక్ వ్యర్థాలతో జాతీయ రహదారి అస్తవ్యస్తంగా తయారైంది.

జనాల తరలింపునకు పాట్లు

నెల్లిమర్ల: ప్రధాన మంత్రి సభకు జనాలను అధికార్లు తరలించ డానికి పాడరాని పాట్లు పడ్డారు. బుధవారం స్థానిక రామ తీర్థం జంక్షన్‌లో ఎంపిడిఒ, నగర పంచాయతీ కమిషనర్, వెలుగు, మెప్మా అధికార్లు జనాలను సభకు తరలించడానికి ఉదయం నుంచి వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. నగర పంచాయతీతో బాటు, మండలానికి 18 బస్సులు కేటాయించగా ప్రజలను బస్సెక్కించడానికి అధికార యంత్రాంగం ఇబ్బందులు పడ్డారు. వరి నూర్పులు, సంక్రాతి పండుగ సందర్భంగా కొంతమందికి ఇష్టం లేకపోయినా కూటమి నాయకులు, అధికార యంత్రాంగం ఒత్తిడి మేరకు అయిష్టంగా బస్సు ఎక్కినట్లు తెలిస్తోంది.

రూ.వెయ్యి ప్రాణం తీసేలా చేసింది

●పథకం ప్రకారమే హత్య ● ఎరుకొండ కేసులో నేరాన్ని అంగీకరించిన నిందితుడు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

వెయ్యి రూపాయలు కోసం తగాదాయే తన స్నేహితుడు, తన తోటి పనివాడైన గొర్లె పవన్‌కుమార్ (22)ను హత్య చేయడానికి కారణమైందని నిందితుడు బొంతు అప్పలనాయుడు పోలీసులు ముందు అంగీకరించినట్లు భోగాపురం రూరల్ సిఐ రామకృష్ణ తెలిపారు. ఎరుకొండ హత్యకేసులో నిందుతుడును పట్టుకొని కోర్టుకు తరలిస్తున్నట్లు బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. నిందితుడు అప్పలనాయుడు, పవన్‌కుమార్‌తో పాటు మరి కొంత మంది కలసి పూసపాటిరేగ చుట్టు పక్కల ఇళ్లకు రంగులు వేస్తుంటారు. రంగలు వేసిన తరువాత కూలీని అప్పలనాయుడు తెచ్చి మిగతా వారికి పంచుతాడు. అలా పవన్‌కు సంబంధించిన రూ. 1000లు అప్పలనాయుడు దగ్గర ఉండిపోయింది. ఎన్నిసార్లు అడిగినా ఇవ్వకపోవడంతో పవన్‌కు కోపం వచ్చి తగాదా పడి అందరి ముందు అప్పలనాయుడును అవమానించాడు. దీంతో ఎలాగైనా పవన్‌ను హత్యచేయాలని అప్పలనాయుడు పథకం పన్నాడు. గోడలకు సున్నాలు గోకుకునే బ్లేడును జేబులో ఉంచుకొని ఈ నెల 5వ తేది రాత్రి మద్యం సేవించారు. గ్రామానికి చెందిన వైఎస్ఆర్ విగ్రహం వద్ద రాత్రి 10 గంటలు సమయంలో మరలా ఇద్దరూ ఘర్షణ పడ్డారు. కొంత సేపటి తరువాత అప్పలనాయుడు బైక్‌పై పవన్ ఎక్కి వెలుతున్నారు. పవన్ తన ఇంటి దగ్గరకు వచ్చే సరికి బైక్ నుంచి గెంతేసాడు. ఎందుకు గెంతేసావని అప్పలనాయుడు, పవన్‌కు మధ్య మరలా ఘర్షణ జరిగింది. ఈ ఘర్షణలో అప్పలనాయుడు పథకం ప్రకారం తెచ్చుకున్న బ్లేడ్‌తో పవన్ కడుపులో నాలుగు పోట్లు పొడిచాడు. పవన్ కేకలు వేయడంతో వెంటనే పవన్ అమ్మ, అమ్మమ్మ బయటకు వచ్చారు. వెంటనే అప్పలనాయుడు అక్కడి నుంచి బైక్‌పై పారిపోయాడు. తీవ్రంగా గాయపడిన పవన్ అక్కడికక్కడే మృతి చెందాడు. పవన్ మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న అప్పలనాయుడు సమీపంలోని తోటల్లోకి వెళ్లిపోయాడు. విశాఖపట్నం వెళ్లిపోవాలని ప్రయత్నిస్తుండగా పోలీసులకు దొరికి పోయాడని సిఐ తెలిపారు. అతనిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ దుర్గాప్రసాదర్, పోలీసులు శ్రీనువాసరావు, లక్ష్మినారాయణ ఉన్నారు.

1200 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

ప్రజాశక్తి- మెంటాడ

మండల సరిహద్దులోని అరకు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో రొంపిల్లి, నెల్లిగుడ్డి, కోటపర్తివలస, సోట్టొడివలస, రాబ తదితర గ్రామాలలో బుధవారం అంతర జిల్లా ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కోట పర్తవలస గ్రామ కొండ శిఖర ప్రాంతంలో నాటుసారా తయారీకి వినియోగించే సుమారు 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటను గుర్తించి ధ్వంసం చేశారు. కొండశిఖరంలో సారా తయారీ జరుగుతుందని అందిన సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు మూకుమ్మడి దాడులు చేశారు. అధికారుల రాకను గమనించిన సారా తయారీ దారులు పరారయ్యారు. ఈ సందర్భంగా సమీప గ్రామాల్లో ఉన్న సారా, కల్లు తయారీ, అమ్మకం దారులకు అవగాహన కల్పించారు. వాటి వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు వివరించారు. క్రయ, విక్రయాలు జరిపితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ దాడుల్లో గజపతినగరం సిఐ జె.జనార్ధనారావు, ఎస్ఐ పి.నరేంద్ర కుమార్, అరకు సిఐ ఎ.సంతోష్, ఎస్ఐ రమేష్, అరకు మొబైల్ సిఐ శ్రీధర్, విజయనగరం డిటిఎఫ్ ఎస్ఐ గంగాధర్ సిబ్బంది పాల్గొన్నారు.

కలకలం రేపిన యువకుడి అదృశ్యం

● కిడ్నాప్‌కు గురయ్యాడంటూ ప్రచారం ● పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

రాత్రివేళ బహిర్భూమికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చిన ఒక యువకుడు అదృశ్యమయ్యాడు. దీంతో గ్రామంలో కలకలం రేగింది. బైకులపై కొంత మంది వచ్చి ఎత్తుకుపోయారనే ప్రచారం జోరందుకుంది. దీంతో కుటుంబ సభ్యులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటన మండలంలోని తీర ప్రాంతమైన చినకొండ్రాజుపాలెం గ్రామంలో జరిగింది.

వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన గనగళ్ళ దానయ్య (30) వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. మంగళవారం రాత్రి 9 గంటలు ప్రాంతంలో భోజనం చేసి బయటకు బహిర్భూమికి వెళ్లేందుకు వచ్చాడు. ఆ తరువాత ఎంతసేపటకి తిరిగి రాకపోవడంతో వెంటనే కుటుంబ సభ్యులు గ్రామస్తులకు, బంధువులకు చెప్పడంతో రాత్రంతా వెతికారు. అతని వెంట సెల్‌ఫోన్ కూడా తీసుకు వెళ్ళలేదు. బుధవారం ఉదయం చోడిపిల్లిపేట, కొండ్రాజుపాలెం గ్రామాలకు చెందిన మత్స్యకారులందరు సముద్ర తీరాన, తోటల్లోన వెతికారు. కాని ఎక్కడా ఆచూకి లభించలేదు.

కిడ్నాప్‌కు గురయ్యాడంటూ ప్రచారం

మంగళవారం రాత్రి దానయ్య బయటకు వెళ్లిన సమయంలో నాలుగు బైకులపై కొంత మంది యువకులు వచ్చినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. వీరు ఏమైనా కిడ్నాప్ చేసి ఉంటారనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే జరిగితే బైకలపై వచ్చిన వ్యక్తులు ఎవరై ఉంటారని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. లేదా ఇంకేమైనా జరిగిందనే దానిపై పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. బుధవారం ఉదయం కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని ఎస్ఐ పాపారావు తెలిపారు.

CHANGE OF NAME

I, JHANSI LACHPATULA (old Name) W/O SRINU MAHANTI, D.No 4-125, BOODI STREET, PUSAPATIREGA, VIZIANAGARAM, PIN : 535204, ANDHRA PRADESH, INDIA. I HAVE CHANGED MY NAME AS **JHANSI MAHANTI** (NEW NAME) HEREAFTER MY NAME IS KNOWN AS **JHANSI MAHANTI** (NEW NAME)

CHANGE OF NAME

I, SANYSI NAIDU MAHANTI (old Name) S/O Ramulu (late), D.No 4-125, BOODI STREET, PUSAPATIREGA, VIZIANAGARAM, PIN : 535204, ANDHRA PRADESH, INDIA. I HAVE CHANGED MY NAME AS **SANYASI NAIDU MAHANTI** (NEW NAME) HEREAFTER MY NAME IS KNOWN AS **SANYASI NAIDU MAHANTI** (NEW NAME)